క్లుప్తంగా

15,16 తేదీల్లో ఉచిత మెగా వైద్యశిబిరం

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్‌లో ఈ నెల 15,16 తేదీల్లో మెగా వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. జేసీఐ వైజాగ్ స్టీల్ సిటీ, లయన్స్ క్లబ్, లీ హెల్త్ డొమైన్ సంయుక్త ఆధ్వర్యంలో ఉక్కు స్టేడియంలోని వెల్‌నెస్ సెంటర్‌లో శిబిరం నిర్వహిస్తు న్నారు. ప్రాజెక్ట్ స్మూత్ వాక్ పేరిట బోన్ మరి యు జాయింట్ హెల్త్ ప్రతీ ఒక్కరికీ నినాదంతో ఏర్పాటు చేస్తున్న శిబిరంలో వివిధ పరీక్షలు నిర్వహించనున్నామని నిర్వాహకులు తెలిపారు.

స్వచ్ఛతపై ఐవోసీ ప్రచారం

గాజువాక: స్వచ్ఛతపై ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ (ఐఓసీ) గాజువాకలో ప్రచారం నిర్వహించింది. స్వచ్ఛతా పఖ్వాడ 2023 పేరుతో కళాకారుల ద్వారా వీధినాటికలతో అవగాహన కార్యక్రమాలను నిర్వహించింది. జీవితంలో స్వచ్ఛత, చెట్ల పెంపకం ప్రాముఖ్యత, మరుగుదొడ్ల నిర్మాణం, పొడిచెత్త, తడి చెత్తను వేరు చేయడం తదితర కార్యక్రమాల ద్వారా స్వచ్ఛ భారత్‌ను సాధించే మార్గాలను కళాకారులు వివరించారు. కంప్రెస్డ్ నేచురల్ గ్యాస్ (సీఎన్‌జీ) వాహనాలకు ప్రత్యామ్నాయ ఇంధనంగా ఉపయోగపడే విధానాన్ని నాటిక ద్వారా కళాకారులు ప్రజలకు తెలియజేశారు. పైపుల ద్వారా గ్యాస్‌ను ప్రతి ఇంటికీ ఏర్పాటు చేయనున్న కార్యక్రమంపై కూడా కళాకారులు ప్రదర్శించిన నాటిక ఆకట్టుకుంది.

'జగనన్న సురక్ష'పై అవగాహన

పెదగంట్యాడ: జీవీఎంసీ 76వ వార్డు గాంధీనగర్ సచివాలయంలో జగనన్న సురక్ష కార్యక్రమంపై వైఎస్సార్ సీపీ వార్డు అధ్యక్షుడు దొడ్డి రమణ బుధవారం అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంపై విస్తృతంగా ప్రచారం చేయాలని వలంటీర్లు, సచివాలయ సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో జేసీఎస్ మండల ఇన్‌చార్జి కులుకూరి మంగరాజు, సీవో సూర్యనారాయణ, తాటికొండ జగదీష్, కిరణ్ సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు పాల్గొన్నారు.

దిశ ఫౌండేషన్ కార్యవర్గం ఎన్నిక


దిశ ఫౌండేషన్ నూతన కార్యవర్గ సభ్యులు

పెదగంట్యాడ: దిశ ఫౌండేషన్ జిల్లా అధ్యక్షురాలిగా మంత్రి మంజుల ఎన్నికయ్యారు. 65వ వార్డు వాంబే కాలనీలో కొత్త కార్యవర్గాన్ని బుధవారం ఎన్నుకున్నారు. కార్యదర్శిగా తిప్పల స్వాతి, ఉపాధ్యక్షురాలిగా గొరుసు రామలక్ష్మి, గాజువాక అధ్యక్షురాలిగా విమలా థామస్, కార్యదర్శిగా ఎస్‌కే ఆశ, జాయింట్ సెక్రటరీగా పొన్నాడ సరోజిని, ఉపాధ్యక్షురాలిగా ఇందుకూరి లోవలక్ష్మి, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా మేరీ ఎన్నికయ్యారు.

యువకుడి బలవన్మరణం


రాంబాబు (ఫైల్)

కూర్మన్నపాలెం: మనస్థాపానికి గురైఓ యువకుడు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్న ఘటన దువ్వాడ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. దువ్వాడ సీఐ శ్రీనివాసరావు తెలిపిన వివరాలివి.. 86వ వార్డు తలారివానిపాలెం ప్రాంతంలో మజ్జి బంగారునాయుడు కుమారులు నాగేశ్వరరావు, రాంబాబు(23)తో కలసి నివసిస్తున్నారు. మజ్జి నాగేశ్వరరావు విజయనగరంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో సూపర్‌వైజరుగా పని చేస్తున్నాడు. బంగారునాయుడు ఆరోగ్యం బాగాలేక పోవడంతో మంగళవారం విజయనగరంలో ఆసుపత్రికి వెళ్లాడు. రాంబాబు ఒక్కడే ఇంటిదగ్గర ఉన్నాడు. పక్కింటి వారు ఇంటి తలుపులు ఎంత కొట్టినా లోపల ఉన్న రాంబాబు తలుపులు తీయకపోవడంతో, కిటికీలో నుంచి చూడగా రాంబాబు ఫ్యాన్‌కు ఉరి వేసుకుని కనిపించాడు. వెంటనే సమాచారాన్ని రాంబాబు సోదరుడు నాగేశ్వరరావుకు తెలియపరిచారు. అక్కడికి చేరుకున్న నాగేశ్వరరావు ఘటనపై దువ్వాడ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దువ్వాడ పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

జగనన్న సురక్ష .. పేదలకు రక్ష


మహిళకు ధ్రువపత్రం అందిస్తున్న ఎమ్మెల్యే నాగిరెడ్డి, సీడీఎంఏ కోటేశ్వరరావు, జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ


జగనన్న సురక్ష కార్యక్రమంలో పాల్గొన్న ప్రజలు

- అర్హులందరికీ సంక్షేమ పథకాలు చేరడమే లక్ష్యం
- ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి

కూర్మన్నపాలెం: సంక్షేమ పథకాల కోసం గతంలో ఉద్యమాలు జరిగేవని, అలాంటిది వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఎలాంటి వివక్ష లేకుండా గడప వద్దకే తీసుకెళ్లి అందించగలుగుతున్నామని ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి అన్నారు. అర్హత ఉన్న ప్రతీ ఒక్కరికీ పథకాలు చేర్చాలనే ఉద్దేశంతో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు అమలు చేస్తున్న జగనన్న సురక్ష కార్యక్రమం పేదలకు వరమని పేర్కొన్నారు. జీవీఎంసీ 87వ వార్డు తెలకులవీధి గ్రౌండ్‌లో బుధవారం నిర్వహించిన గాజువాక నియోజకవర్గ స్థాయి జగనన్న సురక్ష కార్యక్రమంలో ఎమ్మెల్యేతో పాటు మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ కమిషనర్ అండ్ డైరెక్టర్ (సీడీఎంఏ) పి.కోటేశ్వరరావు, జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్‌వర్మ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎక్కడా లంచాలకు తావు లేకుండా ప్రజలందరికీ పారదర్శకంగా పథకాలు అందిస్తున్నారని చెప్పారు.

గ్రామస్వరాజ్యం సాకారం

సీడీఎంఏ కోటేశ్వరరావు మాట్లాడుతూ కోటేశ్వరరావు మాట్లాడుతూ గాంధీజీ కలలు గన్న గ్రామ స్వరాజ్యాన్ని సచివాలయ వ్యవస్థతో సాకారం చేసిన ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి దక్కుతుందన్నారు. గతంలో ప్రతీ పనికి కార్యాలయాలు, అధికారుల చుట్టూ నెలల తరబడి తిరిగే పరిస్థితి ఉండేదని, నేడు జగనన్న సురక్ష క్యాంపుతో ప్రజలకు ఉచితంగా 11 రకాల సేవలు అందించేందుకు అధికారులే ప్రజల చుట్టూ తిరుగుతున్నారని అన్నారు. గాజువాక నియోజకవర్గ పరిధిలో జగనన్న సురక్ష కార్యక్రమంలో 6172 దరఖాస్తులు అందాయని, వాటిలో ఇప్పటికే 4348 దరఖాస్తులను పరిశీలించి సర్టిఫికెట్లు అందించామన్నారు. ఒక్క 87వ వార్డులోనే 680 సర్టిఫికెట్లు అందించినట్లు చెప్పారు. కార్యక్రమంలో గాజువాక జెడ్సీ పి.సింహాచలం, జిల్లా సోషల్ మీడియా కన్వీనర్ తిప్పల వంశీరెడ్డి, డీసీఎంఎస్ చైర్‌పర్సన్ పల్లా చిన్నతల్లి, వైఎస్సార్‌సీపీ వార్డు ఇన్‌చార్జి కోమటి శ్రీనివాసరావు, కార్పొరేటర్లు భూపతిరాజు సుజాత, స్థానిక నాయకులు ఇల్లపు ప్రసాద్, ప్రగడ వేణుబాబు, బొడ్డ గోవింద్, కోమటి రమాదేవి, చిత్రాడ వెంకటరమణ, ఎన్నేటి రమణ, బలిరెడ్డి నాగేశ్వరరావు, దుగ్గపు దానప్పలు, ఆడారి శ్రీను, సచివాలయ కన్వీనర్లు, వలంటీర్లు, గృహసారథులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ నియంత్రించాలి

పర్యావరణాన్ని నాశనం చేసే ప్లాస్టిక్‌ను నియంత్రించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని తిరుమలనగర్ సంక్షేమ సంఘం సభ్యులు హితవు పలికారు. సంక్షేమ సంఘం ప్రతినిధులు జగనన్న సురక్ష క్యాంపులో స్టాల్‌ను ఏర్పాటు చేసి, పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించారు. ప్లాస్టిక్ బదులుగా పేపర్ ప్లేట్లు, గ్లాసులు, నార సంచులు వినియోగించాలని కోరారు. స్టాల్‌ను సందర్శించిన అధికారులు సభ్యులను అభినందించారు.

ఆఫీసుల చుట్టూ తిరిగే పని తప్పింది



గతంలో పిల్లల చదువు నిమిత్తం కుల, ఆదాయ ధ్రువపత్రాల కోసం తహసీల్దార్ కార్యాలయం చుట్టూ కాళ్లు అరిగేలా తిరిగేవాళ్లం. కానీ ఇప్పుడు సచివాలయాలు రావడంతో దగ్గరలోనే కార్యాలయాలు వచ్చాయి. వలంటీర్లు ఇంటికి వచ్చి కుల, ఆదాయ సర్టిఫికెట్ల కోసం పేర్లు నమోదు చేసుకుంటున్నారు. గతంలో ఒక సర్టిఫికెట్ రావాలంటే నెల పైగా సమయం పట్టేది. ఇప్పుడు కేవలం 5 రోజుల్లోనే జగనన్న సురక్ష క్యాంపులో సర్టిఫికెట్ ఇచ్చారు.
– కుర్ర మంగమ్మ, వడ్లపూడి

3 రోజుల్లోనే కుల ధ్రువీకరణ పత్రం



గతంలో కుల ధ్రువీకరణ పత్రం కోసం చాలా ఇబ్బంది పడేదాన్ని. ఇప్పుడు వలంటీర్ ఇంటికే వచ్చి, పత్రాలను పరిశీలించి అర్హత ఉందంటూ కులధృవీకరణ పత్రం కోసం పేరు నమోదు చేసుకున్నారు. కేవలం 3 రోజుల్లోనే కుల ధ్రువీకరణ పత్రాన్ని సిద్ధం చేసి జగనన్న సురక్ష క్యాంపు ద్వారా అందజేశారు.
– ఇందల సూర్యకళ, వడ్లపూడి

పైసా ఖర్చు లేకుండా సర్టిఫికెట్



కొత్త విద్యాసంవత్సరం రావడంతో మా పిల్లలకు కుల ధ్రువీకరణ పత్రం అవసరమైంది. దరఖాస్తు చేసుకోగానే వలంటీర్ ఇంటికే వచ్చి వివరాలు నమోదు చేసుకున్నారు. పైసా ఖర్చు లేకుండా, ఎక్కడికీ తిరిగే అవసరం లేకుండా సర్టిఫికెట్ అందించారు. చాలా ఆనందంగా ఉంది.
– ఎస్.ద్రాక్షాయిని, గణేష్‌నగర్

మానవత్వానికి ప్రతిరూపాలు వలంటీర్లు

- వారి సేవలు మరువలేం
- కొనియాడుతున్న లబ్ధిదారులు

పెదగంట్యాడ: రాష్ట్రంలో వలంటీర్ వ్యవస్థ సేవకు మారుపేరుగా నిలిచింది. అర్హులందరికీ సంక్షేమ పథకాలను పారదర్శకంగా అందించేందుకు నియమించిన వలంటీర్లు ప్రతీ ఇంటికి ఆత్మీయ బంధువై, ప్రజల మన్ననలు అందుకుంటున్నారు. కరోనా విపత్తు వేళ గడప దాటి బయటకు రాలేని విపత్కర పరిస్థితుల్లో వారు అందించిన సేవలకు ఎన్నో ప్రశంసలు దక్కాయి. కరోనా రోగులకు మందులు, పౌష్టికాహారం అందించి ఎంతోమంది ప్రాణాలు నిలిపారు.

తలుపు తట్టి పింఛన్ అందిస్తూ..

లబ్ధిదారుల ఇంటికే వెళ్లి ఠంచన్‌గా పింఛన్ అందించడంతో పాటు ప్రతీ కుటుంబానికి ఏయే ప్రభుత్వ పథకాలు వర్తిస్తాయో తెలియజేస్తూ వారితో దరఖాస్తు చేయించి, నేరుగా పథకాల లబ్ధిని అందేలా సహకరిస్తున్నారు. కుల, ఆదాయ, ఫ్యామిలీ మెంబర్, మ్యారేజ్ తదితర సర్టిఫికెట్లను ఇంటికే తీసుకువెళ్లి అందించడంతో దరఖాస్తుదారులు వారి సేవలను కొనియాడుతున్నారు. అర్హులందరినీ బీమా పథకంలో చేర్పించడం, రేషన్ వాహనం ఎప్పుడు వస్తుందో తెలియజేయడం.. ఇలా అన్ని విధాలుగా సహకారం అందిస్తుండడంతో లబ్ధిదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఆస్పత్రికి వచ్చి పింఛన్ ఇచ్చారు



నేను కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాను. నాకు ప్రతి నెలా డయాలసిస్ పెన్షన్ వస్తుంది. ఒక్కసారిగా ఆరోగ్యం క్షీణించడంతో చికిత్స కోసం కేజీహెచ్‌లో చేరాను. పెన్షన్ ఎలా అని ఆందోళన చెందుతున్న సమయంలో వలంటీర్ మల్కాదేవి నేను చికిత్స పొందుతున్న ఆస్పత్రికి స్వయంగా వచ్చి నాకు పెన్షన్ అందజేశారు. ఆమె మేలు మరువలేను.
– పిట్ట అప్పారావు, పాత అయ్యన్నపాలెం,

చేసిన మేలు మర్చిపోలేను



నా భర్తకు కోవిడ్ వచ్చిన సమయంలో మా బంధువులు, స్నేహితులు ఎవరూ సాయం చేయలేదు. ఇంట్లో నుంచి బయటికి వెళ్లలేని పరిస్థితి.. ఆ కష్ట సమయంలో వలంటీర్ వరలక్ష్మి మా ఇంటికి వచ్చింది. మందులు అందించి నా భర్త ప్రాణాలు కాపాడింది. ఆమె రుణం తీర్చుకోలేనిది.
– కె.లక్ష్మి బాలచెరువు

మంచానికే పరిమితమైన సమయంలో..



నాకు వయసు మీద పడింది. మంచానికే పరిమితమయ్యాను. ప్రతి నెలా ఒకటో తేదీన ఉదయం వలంటీర్ ఇంటికి వచ్చి పెన్షన్ ఇస్తున్నాడు. గతంలో గంటల తరబడి క్యూల్లో పడిగాపులు కాసి, పెన్షన్ తీసుకునే పరిస్థితి ఉండేది. ఇప్పుడైతే వెళ్లలేక పెన్షన్ కోల్పోయేదాన్ని. కానీ ఇప్పుడు ఠంచన్‌గా ఒకటో తేదీనే ఇంటికే వచ్చి పెన్షన్ ఇస్తున్నారు. వారి సేవలు దేనితో వెలకట్టగలం? ఆయనకు ధన్యవాదాలు.
– రోషన్ బీ

రేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పెదగంట్యాడ: పెదగంట్యాడ 11కేవీ ఫీడర్ పరిధిలో మరమ్మతుల నేపథ్యంలో ఈ నెల 14న విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నామని ఏపీఈపీడీసీఎల్ జోన్–2 ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ బీకే నాయుడు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు గొడ్డువానిపాలెం, దుర్గవానిపాలెం, సీతానగరం, పెదగంట్యాడ మెయిన్ రోడ్డు, బర్మా కాలనీ, బాబూ జగ్జీవన్ రామ్‌నగర్, రైతుబజార్ ఏరియా, ధర్మాల వీధి, ఎస్సీ కాలనీ, అరుణా కాంప్లెక్స్ ఏరియా, నీలాపువీధి, ఏపీ హెచ్‌బీ కాలనీ, నౌవాస్ పోర్టు రోడ్డు తదితర ప్రాంతాల్లో శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని పేర్కొన్నారు.

గాజువాక సబ్‌స్టేషన్ పరిధిలో..

గాజువాక: గాజువాక విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలోని కృష్ణమందిరం, అజీమాబాద్, రాజీవ్‌మార్గ్ ఫీడర్లకు నిర్వహణ పనులను చేపట్టనున్నందున శుక్రవారం ఉదయం 9 నుంచి 3 గంటల మధ్య ఆయా ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏపీఈపీడీసీఎల్ జోన్–2 ఈఈ బి.కె.నాయుడు తెలిపారు. ఈ కారణంగా భానోజీతోట, రాజీవ్‌మార్గ్, సంజీవగిరి కాలనీ, బీసీ రోడ్, అజీమాబాద్, గాజువాక మార్కెట్, పాతగాజువాక, 60 అడుగుల రోడ్, మెహర్ నగర్ ప్రాంతాలకు విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు.

సుందరయ్య కాలనీ సబ్ స్టేషన్ పరిధిలో..

సుందరయ్య కాలనీ విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలోని కర్ణవానిపాలెం, సుందరయ్య కాలనీల ఫీడర్లకు మరమ్మతుల దృష్ట్యా సుందరయ్య కాలనీ, ఆఫీషియల్ కాలనీ, శ్రీనగర్ దిబ్బపాలెం కాలనీ, కృష్ణదేవరాయనగర్, పాత కర్ణవానిపాలెం, శ్రీరామ్‌నగర్ పార్కు, శ్రీనగర్ ప్రాంతాలకు కూడా శుక్రవారం ఉదయం 9 నుంచి 3 గంటల మధ్య విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు.

లారీ ఢీకొని ఆటో డ్రైవరుకు తీవ్రగాయాలు


తీవ్రంగా గాయపడిన ఆటోడ్రైవర్ రామకృష్ణ


ప్రమాదంలో నుజ్జయిన ఆటో ముందుభాగం

కూర్మన్నపాలెం: లారీ ఢీకొని ఆటో డ్రైవరుకు తీవ్రగాయాలైన ఘటన దవ్వాడ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఈ మేరకు దువ్వాడ సీఐ శ్రీనివాసరావు తెలిపిన వివరాల ప్రకారం.. పరవాడ మండలం ఈ.మర్రిపాలెం ప్రాంతానికి చెందిన ఆటో డ్రైవర్ తనుబుద్ది రామకృష్ణ బుధవారం తెల్లవారుజామున ఆటోలో కూరగాయలతో పాటు ఈశ్వరమ్మ, వరలక్ష్మి, లక్ష్మి అనే ముగ్గురు మహిళలను తీసుకొని గాజువాక రైతుబజారుకు బయలుదేరాడు. వడ్లపూడి జంక్షన్ వద్ద గాజువాక నుంచి ఆటోనగర్ వైపు వెళ్తున్న లారీ బలంగా ఢీకొంది. దీంతో ఆటో ముందు భాగం నుజ్జునుజ్జుకావడంతో పాటు ఆటోడ్రైవర్ రామకృష్ణకు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే అతడిని స్థానికంగా ఉన్న ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ఆటోలో ఉన్న మహిళలకు స్వల్ప గాయాలయ్యాయి. దువ్వాడ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

డ్రగ్స్‌తో భవిష్యత్తు అంధకారం


విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న న్యూపోర్టు సీఐ సువ్వారి రాము

పెదగంట్యాడ: యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని న్యూపోర్టు పోలీస్‌స్టేషన్ సీఐ సువ్వారి రాము సూచించారు. చదువుకునే వయసులో దురలవాట్లకు బానిస కావొద్దన్నారు. మత్తు పదార్థాల వల్ల అనర్థాలపై నడుపూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు బుధవారం అవగాహన కల్పించారు. డ్రగ్స్‌తో భవిష్యత్తు అంధకారమవుతుందన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం రాచకొండ శ్రీనివాస్, న్యూపోర్టు ఎస్‌ఐ శ్రీనివాస్, మహిళా పోలీసులు పాల్గొన్నారు.

మిస్సింగ్ జీతాల సమస్య పరిష్కారానికి వినతి

గాజువాక: రెండేళ్లుగా పారిశుధ్య కార్మికుల మిస్సింగ్ జీతాల సమస్యను వెంటనే పరిష్కరించాలని జీవీఎంసీ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) నాయకులు కోరారు. యూనియన్ గాజువాక సీనియర్ ఉపాధ్యక్షుడు గొలగాని అప్పారావు ఆధ్వర్యంలో కార్మికులు జీవీఎంసీ సీఎంవోహెచ్ డాక్టర్ నరేష్ కుమార్‌ను కలిసి వినతి అందజేశారు. 2021 ఆగస్టు నుంచి ఈ ఏడాదిలో ఇప్పటివరకు 68, 69 వార్డులలో పారిశుధ్య కార్మికులకు జీతాలు రాలేదని పేర్కొన్నారు. గాజువాక జోన్‌లో ప్రతి వార్డు నుంచి కనీసం పది మంది కార్మికుల జీతాలు మిస్ అవుతున్నాయని తెలిపారు. సమస్యను పరిష్కరించాలని కోరారు. వినతి పత్రం సమర్పించిన వారిలో యూనియన్ నాయకులు శ్రావణ్, శేషుబాబు, రాజశేఖర్ తదితరులున్నారు.

హైమాస్ట్ దీపాలు ప్రారంభం

అగనంపూడి: జీవీఎంసీ 85వ వార్డు ఫార్మాసిటీ నిర్వాసిత కాలనీ హైస్కూల్ వద్ద ఏర్పాటు చేసిన హైమాస్ట్ లైట్లను ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ప్రధాన కూడళ్లు, దేవాలయాల సముదాయాల వద్ద అధునాత దీపాలు ఏర్పాటు చేయనున్నామన్నారు. మరో రెండు మాసాల్లో వీధి దీపాల ఏర్పాటు, విద్యుదీకరణ పూర్తి చేయనున్నామని చెప్పారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి తిప్పల దేవన్‌రెడ్డి, కార్పొరేటర్ ఇల్లపు వరలక్ష్మి, గాజువాక జేసీఎస్–2 కన్వీనర్ ఇల్లపు ప్రసాద్, నాయకులు పాల్గొన్నారు.

881వ రోజుకు ఉక్కు రిలే దీక్షలు

కూర్మన్నపాలెం: ప్రభుత్వరంగ సంస్థలను ప్రైవేటీకరణ చేద్దామనుకునే కేంద్ర ప్రభుత్వ నిర్ణయం సరికాదని ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు అన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలో జరుగుతున్న రిలే నిరాహార దీక్షల్లో 881వ రోజు బుధవారం పలు విభాగాల కార్మికులు పాల్గొని, నిరసన తెలిపారు. కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు, ఇతర కార్మికులు పాల్గొన్నారు.

మిల్లెట్ మేళా బ్రోచర్ ఆవిష్కరణ


బ్రోచర్ ఆవిష్కరిస్తున్న స్టీల్‌ప్లాంట్ సీఎండీ, డైరెక్టర్లు, ఆహార భద్రత అధికారులు

ఉక్కునగరం: ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్డ్స్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఎఫ్‌ఎస్‌ఎస్‌ఏఐ) ఆధ్వర్యంలో నిర్వహించనున్న 'ఈట్ రైట్ ఇండియా – వాక్‌థాన్ అండ్ మేళా' బ్రోచర్‌ను బుధవారం ఆవిష్కరించారు. స్టీల్‌ప్లాంట్ సహకారంతో ఈ నెల 29న ఉక్కునగరంలో ఉదయం వాక్‌థాన్ నిర్వహించనున్నారు. అదే రోజు ఉక్కునగరం క్లబ్‌లో మిల్లెట్స్‌పై వంట పోటీలు ఏర్పాటు చేశారు. బాలబాలికలకు వ్యాసరచన, స్లోగన్, పోస్టర్ పెయింటింగ్ తదితర పోటీలు నిర్వహిస్తున్నారు. ఉక్కు ప్రధాన పరిపాలన భవనంలో జరిగిన కార్యక్రమంలో సీఎండీ అతుల్ భట్, డైరెక్టర్లు డి.కె. మొహంతి, అతుల్ భాగ్చీ, ఎస్.సి. పాండే, సీజీఎంలు డాక్టర్ కె.హెచ్. ప్రకాశ్, జి. గాంధీ, ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్డ్స్ అధికారులు పలువురు పాల్గొన్నారు.

రైలు కింద పడి వ్యక్తి ఆత్మహత్య



అగనంపూడి: దువ్వాడ రైల్వే స్టేషన్ ప్లాట్‌ఫామ్–3 రైల్వే ట్రాక్‌పై పడి ఒక వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డారు. దువ్వాడ రైల్వేస్టేషన్ జీఆర్‌పీ ఎస్‌ఐ శాంతారామ్ తెలిపిన వివరాల ప్రకారం.. బుధవారం ఉదయం దువ్వాడ రైల్వేస్టేషన్‌లోని మూడో ప్లాట్‌ఫామ్ వద్ద సుమారు 50 సంవత్సరాల వయసు ఉన్న వ్యక్తి రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నారు. నలుపు ట్రాక్, నీలంరంగు టీ షర్ట్, హవాయి చెప్పులు ధరించి ఉన్న వ్యక్తి వివరాలు తెలియకపోవడంతో మృతదేహానికి పంచనామా నిర్వహించి అనకాపల్లి ప్రాంతీయ ఆస్పత్రిలోని మార్చురీలో భద్రపర్చినట్టు ఆయన తెలిపారు. వివరాల కోసం 76739 06010 నంబర్‌ను సంప్రదించాలని ఎస్‌ఐ కోరారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు.

పేదలకు బియ్యం పంపిణీ

పెదగంట్యాడ: ఐఎన్‌టీయూసీ నాయకుడు కురందాస్ వంశీకృష్ణ యాదవ్ జన్మదినాన్ని పురస్కరించుకుని పేదలకు బుధవారం బియ్యం పంపిణీ చేశారు. కార్యక్రమానికి హాజరైన ఐఎన్‌టీయూసీ జాతీయ కార్యదర్శి మంత్రి రాజశేఖర్ చేతులమీదుగా బియ్యం పంపిణీ చేశారు. కార్యక్రమంలో కారు రమణ, నమ్మి అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఉక్కు భద్రతా అధికారికి సత్కారం

అగనంపూడి: విశాఖ స్టీల్‌ప్లాంట్ భద్రతా విభాగాధిపతిగా నియమితులైన ఉక్కు జనరల్ మేనేజర్ దువ్వాడ రామ్ ప్రసాద్‌ను అగనంపూడికి చెందిన ప్రజా సంఘాల నాయకులు ఘనంగా సత్కరించారు. రామ్ ప్రసాద్ జనరల్ మేనేజర్‌గా ఉంటూ ఉక్కులోని అన్ని విభాగాల భద్రతా అధిపతిగా నియమితులయ్యారు. ఈ సందర్భంగా ఆయన్ను అగనంపూడి సీడబ్ల్యూసీలో నిర్వహించిన కార్యక్రమంలో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఫినిక్స్ ఎనర్జీ యువన్ని ఎంటర్‌ప్రైజెస్ అధినేత జి.వెంకటేశ్వరరావు, సీడబ్ల్యూసీ కార్యదర్శి కరణం పైడిరాజు, నాయకులు కొలిపాక అప్పారావు, సాయిన సన్యాసిరావు, బలిరెడ్డ సత్యనారాయణ పాల్గొన్నారు.

సౌత్ ఇండియా కరాటే పోటీల పోస్టర్ ఆవిష్కరణ

గాజువాక: ఈ నెల 16 నుంచి నగరంలో నిర్వహించనున్న 8వ సౌత్ ఇండియా వడోకాయ్ కరాటే పోటీల బ్రోచర్‌ను రాజ్యసభ సభ్యుడు జీవీఎల్ నర్సింహారావు బుధవారం ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ వడోకాయ్ కరాటే డు అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న ఈ పోటీల్లో గెలుపొందిన క్రీడాకారులను నవంబర్ నెలలో విశాఖలో నిర్వహించనున్న అంతర్జాతీయ కరాటే పోటీలకు ఎంపిక చేయాలని నిర్ణయించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో బీజేపీ గాజువాక కన్వీనర్ కరణంరెడ్డి నర్సింగరావు, కరాటే అసోసియేషన్ ప్రతినిధులు చిగురుపల్లి సతీష్ కుమార్, నూకరాజు తదితరులు పాల్గొన్నారు.

డీఈవో పాఠశాలల సందర్శన


మింది హైస్కూల్లో పీహెచ్ స్కేల్ ప్రయోగాన్ని డీఈవో చంద్రకళకు వివరిస్తున్న విద్యార్థులు

అక్కిరెడ్డిపాలెం: జిల్లా విద్యాశాఖాధికారి చంద్రకళ 68వ వార్డు మింది జిల్లా పరిషత్ హైస్కూల్, రాంనగర్ ఎంపీపీ స్కూళ్లను బుధవారం సందర్శించారు. మింది హైస్కూల్‌లో ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానల్ (ఐఎఫ్‌పీ) బోర్డులను పరిశీలించిన అనంతరం విద్యార్థుల నోట్ బుక్స్ తనిఖీ చేశారు. పాఠ్యాంశాలు నోట్ బుక్స్‌లో రాసుకోవడంలో కొన్ని తేడాలను పరిశీలించారు. శ్రద్ధగా చదువుకోవాలని విద్యార్థులకు సూచించారు. అనంతరం విద్యార్థులు పీహెచ్ స్కేల్ నమోదును ప్రయోగాత్మకంగా డీఈవోకు చేసి చూపించారు. యూనిఫాం ధరించని విద్యార్థులను గుర్తించిన ఆమె ఇకపై యూనిఫాం ధరించి పాఠశాలకు రావాలని సూచించారు. విద్యార్థులకు మధ్యాహ్న భోజనాన్ని స్వయంగా వడ్డించారు. విద్యార్థుల చదువుపై సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం గుడివాడ అప్పన్నకాలనీలోని రాంనగర్ ఎంపీపీ స్కూల్‌ను సందర్శించారు. విద్యార్థుల పుస్తకాలను, పాఠశాల పరిస్థితులను పరిశీలించారు. కార్యక్రమంలో ఎంఈవోలు సునీత, విశ్వనాథ్, డీఈఈ నర్సింగరావు, హెచ్‌ఎం పి.వి.ఎస్.ఎస్.ఎస్. ఆంజనేయ, రాంనగర్ ఎంపీపీ స్కూల్ హెచ్‌ఎం అబ్రహం లింకన్ పాల్గొన్నారు.

కలెక్టర్ పర్యటన రద్దు

కలెక్టర్ డాక్టర్ మల్లికార్జున 68వ వార్డులోని జిల్లా పరిషత్ హైస్కూల్ సందర్శన చివరి క్షణంలో రద్దయింది. బుధవారం మధ్యాహ్నం మింది జెడ్పీ స్కూల్, అనంతరం అక్కిరెడ్డిపాలెం అంగన్వాడీ కేంద్రం సందర్శన, 69వ వార్డు చుక్కవానిపాలెంలోని డాక్టర్ వైఎస్‌ఆర్ ఆరోగ్య కేంద్రం విజిట్ కార్యక్రమాలు రద్దయ్యాయి.

మాజీ సైనికుడి కుటుంబ సభ్యులకు సత్కారం


మాజీ సైనికుని భార్యను సత్కరిస్తున్న ఎంపీ జీవీఎల్

పెదగంట్యాడ: దేశం కోసం ప్రాణ త్యాగం చేసిన మాజీ సైనికుల కుటుంబ సభ్యులను సత్కరించుకోవడం మన బాధ్యత అని రాజ్యసభ సభ్యుడు జీవీఎల్ నరసింహారావు అన్నారు. 74వ వార్డు వెంపళ్లనగర్‌కు చెందిన మాజీ సైనికాధికారి, వీర్ చక్ర అవార్డు గ్రహీత జాజుల సన్యాసి భార్య చినతల్లి, కుమారుడు గంగరాజును బుధవారం ఆయన ఘనంగా సత్కరించారు. ఆయన మాట్లాడుతూ ప్రధాని మోదీ తొమ్మిదేళ్ల పాలన పూర్తయిన సందర్భంగా బీజేపీ సంపర్క్ సే సమర్థన్ కార్యక్రమంలో భాగంగా సన్యాసి కుటుంబ సభ్యులను పరామర్శించామన్నారు. 1971లో జరిగిన యుద్ధంలో బంకర్లను పేల్చి పాకిస్తాన్ సైనికులను తరిమికొట్టడంలో సన్యాసి కీలక పాత్ర పోషించారని గుర్తు చేశారు. ఆయన సేవలను గుర్తించి ఆయన విగ్రహాన్ని వెంపళ్లనగర్ జంక్షన్‌లో పెట్టాలన్నారు. కార్యక్రమంలో కరణంరెడ్డి నర్సింగరావు, డాక్టర్ చంద్రశేఖర్, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

కాంట్రాక్ట్ కార్మికుల అలవెన్సులపై ధర్నా నేడు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ కాంట్రాక్ట్ కార్మికులకు ఎస్‌ఎంఏ, ఏఎస్‌ఎంఏ, ఐఆర్‌లను గతంలో వలే చెల్లించాలని స్టీల్ వైఎస్సార్‌టీయూసీ నాయకులు డిమాండ్ చేశారు. సెంట్రల్ స్టోర్స్ కూడలి వద్ద బుధవారం జరిగిన కార్మికుల సమావేశంలో నాయకులు మాట్లాడారు. అలవెన్సులపై కూడా ఈఎస్‌ఐ చెల్లించాలని ఈఎస్‌ఐ అధికారులు కాంట్రాక్టర్లను అడిగితే, వారు కార్మికులకు అలవెన్స్‌లను నిలిపివేయడం అన్యాయమన్నారు. ఈ అంశం యాజమాన్యంతో తేల్చుకోవాలని, ఈ అంశంపై గురువారం జరగనున్న ధర్నాను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో యూనియన్ ప్రధాన కార్యదర్శి వై. మస్తానప్ప, ఎం. పరదేశి, పిట్టారెడ్డి, బి. శశిభూషణరావు, బి.వి.రామయ్య తదితరులు పాల్గొన్నారు.

ఎంఈవో వితరణ


చిన్నారులకు పెన్నులు, పుస్తకాలు అందిస్తున్న ఎంఈవో శ్రీనివాసరావు

పెదగంట్యాడ: స్థానిక భవిత కేంద్రంలోని చిన్నారులకు ఎంఈవో ఇమంది శ్రీనివాసరావు సొంత నిధులతో పుస్తకాలు, పెన్నులు, పెన్సిళ్లు, రబ్బర్లు బుధవారం అందజేశారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులను ప్రోత్సహించేందుకు తన వంతు సాయం చేశానని చెప్పారు. కార్యక్రమంలో వినోద్, సూర్యనారాయణ, విజయభారతి పాల్గొన్నారు.